నిజమైన అపచారం

కనకమ్మ చచ్చింది. చచ్చి స్వర్గానికెళ్ళింది. స్వర్గంలో ఒక విధమైన సోవియట్ ప్రభుత్వం ఉంటుందని చెప్పొచ్చు. మిగిలిన దేశాల్లో ఏయే వర్గాలు అనాథలుగా ఉంటారో, వాళ్ళ నియంతృత్వం సోవియట్ ప్రభుత్వంలో అమలు జరిగినట్టే భూలోకంలో అన్ని రకాల యాతిబాధలకూ లోనై, ఒక్క క్షణం కూడా సుఖమన్నది ఎరగని ప్రాణులకు అక్కడ ఉత్తమ స్థానం లభిస్తుంది. ఇది అందరూ అనుకునేమాట.

అయితే స్వర్గంలో కూడా కొన్ని మడతపేచీ లున్నై. కొత్తగా వచ్చిన ప్రాణులందర్నీ స్వర్గం పొలిమేరల బయట కాంపుల్లో ఉంచుతారు. కాలక్రమాన వాళ్ళ కేసులు విచారణ జరిగి, వాళ్ళ మంచి చెడ్డలను బట్టి స్వర్గంలో ఉచిత స్థానాల్లో నివాసాలు నియమిత కాలాలకు ఏర్పాటు చెయ్యటం అవుతుంది.

కనకమ్మ నడివయస్సయినా రాకుండానే చచ్చిపోవటంచేత కనీసం ఒక నెల గడిచేదాకా ఆవిడ కేసు విచారణకు వచ్చే అవకాశం లేదు. స్వర్గంలో ఒకరోజు భూలోకంలో ఒక సంవత్సరం. కనకమ్మ కేసు విచారణకు అవసరమైన సాక్షులకు భూమితో ఋణం తీరటానికి కనీసం ఒక స్వర్గ మాసం అవసరం.

తన పేరు అప్పుడే అనేక పత్రికల్లో పడిందనీ, తన కేసు విచారణకు వచ్చేసరికి స్వర్గవాసులంతా విడ్డూరంగా చూడవస్తారనీ కనకమ్మ ఎరగనే ఎరగదు. భూలోకంలో ఆవిడను ఎవరూ గమించలేదు. ఆవిణ్ణి మొగుడు గుంజకు కట్టి ఎర్ర పలుపులతో రోజూ తాగివచ్చి బాదితే కనకమ్మ పెట్టిన కేకలు విన్నవాళ్ళు విన్నట్టే వుండిపోయినారు. దాన్ని గురించి ఏమీ చెయ్యాలని ఎవరికీ తట్టలేదు. ఆవిడ ఆకలికి ఏళ్ళ తరబడి అల్లాడిపోతే "ఈ కనకమ్మ ఏం తింటున్నది? ఎట్లా బతుకుతున్నది?" అని ఆరాతీసినవాళ్ళు లేరు. ఆవిడ చివరకు మంచానపడి బాధతో రెండు నెల్లు తీసుకుంటే ఆ విషయం కూడా ఎవరూ అట్టే పట్టించుకొన్నట్టు కనపడలేదు. బతికి ఉండగా బయటి పంచను ఆవిణ్ణి తలదాచుకోనిచ్చిన పెద్దమనిషి కూడా చస్తుందని తోచగానే ప్రాణంతోనే వీధిలోకి ఈడ్పించేశాడు.

కనకమ్మను మొగుడు పెట్టిన కష్టాలను గురించి చోద్యంగా చెప్పుకున్న అమ్మలక్కలు,

కబుర్లు మానేసిన మరుక్షణం బేషరతుగా తమ మొగుళ్ళ పక్కలు చేరేవాళ్ళు. నాలుగు రోజులనుంచి ఆవిడకు తిండిలేదని వార్త తెలిసినాక "పాపం!" అని విరక్తిగా చప్పరించేసి మరుక్షణం భోజనాలకి కూర్చుని షడ్రసోపేతంగా మూడు పూటలకి సరిపడా తిన్న అమ్మలక్కలున్నారు. తీరా కనకమ్మ చచ్చినాక ఆవిడ శవాన్ని దహనం చెయ్యటానికి ఇరవై రూపాయలు ఇట్టే పోగుచేసిన ధర్మాత్ములు ఆవిడ జీవించి ఉండగా ఆవిడ అవసరాలకుగాను ఎన్నడూ వసూలు చెయ్యలేదు. ఒకప్పుడు కనకమ్మలో కొంత అభిమానమూ, ఆత్మ విశ్వాసమూ, ఆశా ఉండి వుండవచ్చును. కాని,చచ్చే సమయానికి ఆమెలో మానవులు గర్వించే లక్షణాలేవీ లేవు. ముప్ఫయిదేళ్ళ జీవితంలో ఆమె తన కుండదగిన హక్కులూ, స్వాతంత్ర్యమూ, జ్ఞానమూ, జీవశక్తీ అన్నీ పోగొట్టుకున్నది. ఈ బ్రహ్మాండంలో తనకు ఎక్కడా స్థానం లేదని ఆమె నమ్మింది. ఒక దోమకున్న పాటి అర్హత కూడా తనకు లేదనే నమ్మకం తెచ్చి పెట్టుకున్నది. తనను ప్రపంచం విడిచేసి వూరుకోవటం ఆవిడకు సహజంగానే కనిపించసాగింది. మగవాడై పుడితే తన బతుకు కొంచెం బాగుండేదేమోనని ఒకప్పుడు అనుకొన్నదిగాని, రాను రాను అది గొంతెమ్మ కోరికగా కనపడసాగింది. జీవితమూ, ప్రకృతీ, భగవంతుడూ కట్టుకట్టి తనను, ఒక్కసారిగా కాకుండా, ఒక్కొక్క అణువే నిర్మూలిస్తున్నారని ఆమెకి తోచింది. "నేను ఎంత గొప్పదాన్ని కాకపోతే నా మీద దృష్టి యావత్తూ ఇట్లా ఎదురు తిరుగుతుంది?" అని మటుకు ఆవిడకి తట్టలేదు.

తీరా చచ్చినాక, స్వర్గం వచ్చినాక, తనకు ముందుగా చచ్చిన పిల్లలిద్దరూ మళ్ళీ తనకు కనిపించేసరికి ఆ ఆనందం భరించలేక కనకమ్మ అపరిమితంగా బాధ పడింది. ఆనందం అంత బాధ కలిగిస్తుందని ఆవిడకి అంతకు పూర్వం తెలీదు. ఎట్లా తెలుస్తుంది? ఆవిడకు జీవితంలో ఏ ఆనందమూ లేదు. అట్లా ఎవరన్నా ఉంటారా? ఉండరు. అందుకనే స్వర్గంలోని పత్రికలు ఆవిడను గురించి అంత విడ్డూరంగా రాయటం జరిగింది. ఇంత విపరీతమైన కేసు ఎప్పుడూ విచారణకు వచ్చి ఉండలేదు.

2

కనకమ్మకి స్వర్గం మీద మంచి అభిప్రాయం ఏర్పడింది. ఈ స్వర్గం వాళ్ళు, వాళ్ళ తల్లుల కడుపు చల్లగా, తన పిల్లల్ని తనకు తిరిగి ఇప్పించారే, ఇక్కడ తనను ఒక మనిషల్లే చూస్తున్నారే. ఇంత ఉపకారం ఎవరుచేస్తారు? ఎందుకు చేస్తారు?

"ఏవమ్మోవ్! ఇప్పుడింకేం చూశావ్? త్వరలో నీ విచారణ జరుగుతుంది. ఆ తరవాత నీకు స్వర్గంలో ఫోర్ట్ ఏరియాలో అన్నిటికన్నా ఎత్తైన భవంతిలో మాంఛి ఏడుగదుల ఫ్లాట్

ఇస్తారు; ఎయిర్‌కండిషనింగూ, ఎలక్ట్రిక్ కిచెన్, లిఫ్టూ అన్నిటితో సహా!" అన్నాడొక అబ్బాయి, అతను ప్రెస్ రిపోర్టరని కనకమ్మకి తెలియదు.

"ఎందుకు నాయనా? ఇక్కడ స్వర్గమల్లేనే ఉంది. మనిషి కింతకంటే ఏం కావాలి? నా జన్మకి?" అన్నది కనకమ్మ.

ఆ అబ్బాయి నవ్వి, "ఎబ్బె, ఇది స్వర్గమే కాదు. నువ్విప్పుడు స్వర్గం పొలిమేరలోనే లేవింకా!" అని వెళ్ళిపోయినాడు.

ఆవిడ వచ్చిన వారం రోజులకి ఆవిడ పేరడుగుతూ ఒక పెద్దమనిషి వచ్చాడు. ఆయనకి బట్టతలా, కళ్ళజోడూనూ. చేతిలో కాగితాలు పట్టుకున్నాడు. చిత్రంగా ఆ కాగితాల్లో ఆవిడ జన్మ వృత్తాంతమంతా నాడీ గ్రంథం చదివినట్టు చదివేశాడు. మొదట ఆమెకు ఆశ్చర్యం వేసింది. తరవాత బాధ కలిగింది. మరిచిపోవలసిన విషయాలన్నీ ఆయన తవ్వటం రుచించలేదు.

"జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నా కష్టాలన్నీ గట్టెక్కాయి. ఆ గొడవంతా ఇప్పుడెందుకు?" అన్నది కనకమ్మ.

వచ్చిన పెద్దమనిషి కళ్ళజోడుమీదిగా ఆవిణ్ణి చూసి, "ఇదంతా జరిగిపోయిన దాన్ని గురించి కాదు. జరగవలసినదాన్ని గురించే" అన్నాడు. జరగబోయే విచారణ గురించి ఆ పెద్దమనిషి చెప్పేవరకూ ఆమెకే గోడూ తెలియదు.

"విచారణ దేనికి, నాయనా?"

"నీకు ఎందరో అత్యాచారాలు చేశారు. కనకనే నువ్వన్ని బాధలు పడటం జరిగింది. లీగల్ స్టాండ్ పాయింటునించి నీది చాలా విచిత్రమైన కేసు. నీ వైపున ఒక్క తప్పూ లేదు. ఈ కేసులో ఉన్న నేరమంతా మిగిలిన వాళ్ళమీదే ఉంది. ఐడియల్ కేస్!"

"గ్రహచారం చాలకపోతే ఎవరికైనా కష్టాలు తప్పవు" అన్నది కనకమ్మ ఏమనటానికీ తోచక.

"అదే పొరపాటు. గ్రహాలలో మాకు నమ్మకం లేదు. ఉంటే ఈ స్వర్గమే ఉండదు. పుణ్య పాపాలన్నీ మనిషివే అనే ఉద్దేశంతో స్వర్గనరకాలు ఏర్పడ్డాయి" అన్నాడు ప్లీడరుగారు.

ఆయన రెండు రోజులకొకసారీ, మూడురోజుల కొకసారీ వచ్చి తన దగ్గిర వున్న రికార్డు ఒక్కొక్కటే ఆవిడకి వినిపించి ఆవిడ సంతకాలు చేయించుకు పోసాగాడు. ఆవిడకిదంతా ఏమీ బాగాలేదు. పోయినకొద్దీ ఆమె కిదంతా మరింత రోత కాసాగింది. ఈ రికార్డు ఎంత విన్నా తరగటం లేదు. అందులో తనను ఎరిగున్న ప్రతి ప్రాణీ కూడా ముద్దాయే. ప్లీడరుగారు ఈ ముద్దాయిలతో కూడా మాట్లాడి వస్తున్నట్టు ఆమె కర్థమైంది.

"వాళ్ళంతా ఎక్కడున్నారు?" అన్నదామె.

"ఎక్కడుంటారు?" అన్నాడాయన నవ్వి.

"నాకేం తెలుసు నాయనా? అందులో చాలామందిని చూసి చాలాకాలమయింది. చూసొద్దామని! వాళ్ళిక్కడున్నట్టు తెలిసి, చూడటానికి పోకపోతే బాగుంటుందా?" అన్నదామె.

"ఒక్కొక్కళ్ళే బోనెక్కి నేను చదివే రికార్డు ఆమోదించి, దానిమీద నీ సంతకాలకింద వాళ్లు కూడా సంతకాలు చేసేటప్పుడు చూద్దువుగానిలే!" అన్నాడు ప్లీడరు.

"అయ్యో, ఈ కోర్టులంటే నాకు తగని భయం. మా నాన్న వీటి మూలంగానే నిక్షేపమంటి పొలం, పదెకరాలు ఎందుకూ కాకుండా చేసుకున్నాడు" అన్నదావిడ.

"ఇది అటువంటి కోర్టు కాదు" అని ప్లీడరు వెళ్ళిపోయాడు.

3

ఎట్లాగైతేనేం కనకమ్మ కేసు విచారణకు వచ్చింది. మూడు వందలమంది ముద్దాయిలూ, ఇరవై వేలమంది సాక్షులూ విచారింపబడ్డారు. విచారణలో మొదటి భాగం ఉన్న రికార్డులు కోర్టులో చదవటం. వాటిని ముద్దాయిలూ, సాక్షులూ ఆమోదించినాక వారి సంతకాలు తీసుకోవటం. రెండో భాగమేమిటంటే ముద్దాయిల సంజాయిషీ.

మొదటిభాగమంతా పత్రికలద్వారా అదివరకే స్వర్గవాసులు తెలుసుకుని వున్నారు. ముద్దాయిలను గురించి విచారణకు ముందుగా పత్రికల్లో ప్రచురణ జరగటం స్వర్గంలో సబ్‌జూడిస్ కాదు. అక్కడి లావొప్పుతుంది.

అయినా ప్లీడరుగారు మూడు నాలుగు స్వర్గ మాసాలు ఈ రికార్డు పఠనంతోనే సరిపుచ్చాడు.

స్వర్గవాసులు యీ విచారణ చూడడానికి తండోపతండాలుగా వచ్చారు. రహస్యమేమిటంటే స్వర్గంలో పరిస్థితులేమీ బాగాలేవు. రాజకీయాందోళన జాస్తిగా వుంది. ప్రజలదృష్టిని రాజకీయాల మీదనుంచి మరల్చటానికి పత్రికలు ఈ కేసు గురించి మరింతగా రాసినై. విచారణ కూడా సాధ్యమైనంతగా పొడిగించవలసిందిగా జడ్జిగారికి ప్రభుత్వం ఉత్తరువు చేసినట్టు ఒక వదంతి పొక్కింది.

హైకోర్టు వరండాలో ఇద్దరు ప్లీడర్లు నిలబడి "ఎగ్జిక్యూటివుకు జూడిషియరీ ఇంత లోకువైతే ఇంకేం డెమోక్రసీ?" అని అనుకున్నారు.

ఎట్లాగైతే యేం, రికార్డు చదవటం పూర్తి అయింది. చదివిన రికార్డు మీద కనకమ్మ సంతకం కిందిగా మూడు వందలమంది ముద్దాయిలు మారుమాటాడకుండా సంతకాలు పెట్టారు. జరిగిన విషయాలను గురించి ఎవరూ కాదనలేదు. తాము అట్లాయెందుకు

ప్రవర్తించారో, అందుకుగాను తమను ఎందుకు శిక్షించకూడదో ముద్దాయిలు చెప్పుకోవలసి ఉంది.

ఈ విచారణ ఆరంభం కాకముందు న్యాయాధికారి కనకమ్మకేసి తిరిగి "అమ్మా ఈ మూడు వందలమందీ నీకు రకరకాల అత్యాచారాలు చేశారు. ఇందులో నీ మీద మీ అత్తగారికి నేరాలు చెప్పిన వాళ్ళున్నారు. నీమీద లేని రంకులుకట్టి నిన్ను నీ మొగుడిచేత కొట్టించినవాళ్లున్నారు. నీ భర్తను నీకు కాకుండా చేసి తమ వలలో వేసుకున్న ఆడవాళ్లున్నారు. నీ దగ్గర వున్న కాస్త డబ్బు పుచ్చుకుని నీకు పనికి రాని నీళ్ళు, మందని ఇచ్చినవాళ్లున్నారు. వీరంతా నీకు ఏవిధంగా బాధ కలిగించారో నువ్వు ఈ కోర్టుకు చెప్పుకుంటే, నువ్వు చెప్పినదాని ప్రకారం నీకు నష్టపరిహారం కింద సరిపోయే స్థానం స్వర్గంలో దొరుకుతుంది" అని హెచ్చరించాడు.

"ఎందుకు నాయనా? నాకెవ్వరూ ఏమీ బాధ కలిగించలేదు. నా మీద మా అత్తగారికి పడదు కనకనే వాళ్ళూ వీళ్ళూ చాడీలు చెప్పారు. నా భర్త నమ్మేడు గనకనే నా మీద రంకులు కట్టారు. నేనక్కర్లేకపోయినాక నా మొగుడు ఎవరి దగ్గరికి పోతే ఏముంది, పాపం! ఆ వైద్యులు ఎంత డబ్బు చిక్కులు వుండి నావంటి పేదముండ డబ్బు కాశించారో! నేను బాధపడే గీతవుండి పడ్డాను" అన్నది కనకమ్మ.

జడ్జీగారూ, ప్లీడరుగారూ కూడా ఒకళ్ళ మొహం ఒకరు చూసుకున్నారు.

"ఇదుగో, చూడమ్మా, నువు వీళ్ళందర్నీ సమర్థిస్తే వీళ్ళకు శిక్ష తగ్గుతుందనుకోకు. వాళ్ళకు పడే శిక్ష వాళ్ళకు పడుతుంది. నీ జీవితం ఎవరిమూలంగా, ఎందుమూలంగా కష్టాల పాలయిందో కోర్టుకు చెబితే, దానికి అనుగుణంగా నష్టపరిహారం జరుగుతుంది. అవమానం వల్లనా? నిందవల్లనా? హింసవల్లనా? మోసంవల్లనా? నిరాధారం వల్లనా? దేనివల్ల నీ జీవితం అధికంగా దుఃఖభాజన మయింది? దానికి కారకులెవరు?"

"ఎవరిని మీరెట్లా శిక్షించినా నా కభ్యంతరం లేదు. నాయనా! నా జీవితంలో - మిగిలినవాటి మాటేమిటిగాని - నా వొంటిన రెండువందల రూపాయల నగలుండేవి; నా భర్త క్షయతో తీసుకుంటూ వైద్యానికని ఆ నగలన్నీ అమ్మి ఖర్చు పెట్టి రోగం నయం కాకుండానే పోయినాడు. ఆయన ఆ పని చెయ్యకుండా ఉంటే, నేనూ, నా పిల్లలూ అంత త్వరగా ఆకలికి మాడిచచ్చి ఉండం. ఆ మాటొక్కటే నన్ను చచ్చేవరకూ వేధించింది. నా పిల్లలు నా కళ్ళయెదుట ఆకలికి మాడి చస్తుంటే ఎన్నిసార్లు నా మొగుణ్ణి తిట్టుకున్నాను! ఎన్ని రాత్రులు ఆ నగలు గురించి ఆలోచిస్తూ నిద్రపట్టక మేలుకున్నానో! నా మొగుడు ఒక్క నెల ముందు చచ్చివుంటే, నా పిల్లలిద్దరూ ఇంకోరెండు సంవత్సరాలు ఆలస్యంగా

చచ్చేవాళ్ళు! ఏమో, అప్పటికి వాళ్ళకి కాస్త రెక్కలొచ్చి ఏ మూటలయినా మోసి అట్లా బతికే వాళ్లేమో! అది తలుచుకుంటేనే నా గుండె అవిసిపోతుంది" అన్నది కనకమ్మ.

ఇసక వేస్తే రాలని ఆ కోర్టులో ఆవిడ అన్నదానికి అందరూ నిశ్చేష్టులై అతి నిశ్శబ్దంగా ఉండిపోయినారు.

మొదటి ముద్రణ: జ్యోతి మాసపత్రిక, ఫిబ్రవరి 1948